సాక్షి సూర్యాపేట

మంగళవారం : 28 : ఫిబ్రవరి : 2023



నేడు యాదగిరీశుడి కల్యాణం

యాదాద్రిలో మంగళవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో



ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు

ఆత్మహత్య చేసుకున్న రాకేశ్, దేవి మృతదేహాలకు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 36°/18°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రోడ్డువెడల్పు పనులు త్వరగా పూర్తిచేయాలి



ఆత్మకూర్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకట్రావు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండలంలో రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులు, ఆత్మకూర్‌లో రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దండుమైసమ్మ ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఆర్‌డీఓ రాజేంద్రకుమార్, డీపీఓ యాదయ్య, తహసీల్దార్ హేమమాలిని, డీఎస్పీ నాగభూషణం, ఆర్అండ్‌బీ ఈఈ యాకుబ్, డీఈ మహిపాల్‌రెడ్డి, ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, ఏఈ బాబురావు, ఆర్ఐ అంజయ్య, సర్వేయర్ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి

చివ్వెంల(సూర్యాపేట) : వాహనదారులకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామ క్రాస్ రోడ్డు వద్ద రహదారి పక్కన కూరగాయలు విక్రయిస్తున్న పలువురు వ్యాపారులతో మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన స్థలంలో వ్యాపారం చేసుకోవాలని, రహదారి వెంట షాపులు తీసివేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఆర్‌డీఓ రాజేందర్ కుమార్, డీపీఓ యాదయ్య, డీఎస్పీ నాగభూషణం, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ గోపి, ఏపీఓ నాగయ్య పాల్గొన్నారు.

పేట మార్కెట్‌లో క్వింటా కందులు రూ.8,172

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో కందులకు రికార్డ్ ధర పలికింది. క్వింటా కందులు రూ.8172 గరిష్ఠ ధర వచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర. కాగా కందులకు ప్రభుత్వ మద్దతు ధర రూ.6600. సోమవారం మార్కెట్ యార్డుకు 49 మంది రైతులు 226 బస్తాల కందులను (147 క్వింటాళ్లు) తీసుకొచ్చారు. ఇందులో గరిష్ఠంగా నడిగూడెం మండలం కలకోవ గ్రామానికి చెందిన కేశగాని కోటయ్య తీసుకొచ్చిన కందులకు రూ.8172 ధర పలికింది. కనిష్ఠంగా 6345 ధర వచ్చింది. ఇక వేరుశనగకు మద్దతు ధర రూ.5850 ఉండగా రూ.8131 ధర పలికింది. ఈ ఏడాది జిల్లాలో కంది విస్తీర్ణం తగ్గడంతో దిగుబడి తక్కువగా ఉండి మంచి ధర వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

సూర్యాపేటటౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న 5వ స్థాయీ సంఘం సమావేశం, మార్చి 1వ తేదీన 3వ స్థాయీ సంఘం సమావేశం, 2వ తేదీన 6వ స్థాయీ సంఘం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈఓ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై విజిలెన్స్ అధికారుల విచారణ



తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండలంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగిన అవకతవకలపై రాష్ట్ర విజిలెన్స్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. 2019 ఖరీఫ్ సీజన్ నుంచి 2022 రబీ సీజన్ వరకు ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలొచ్చాయి. వీటిపై పలు ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. వ్యవసాయ శాఖ, ఐకేపీ సిబ్బందిని వివరాలు తెలుసుకున్నారు. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో అమ్మినట్లు తెలుస్తోంది. ఈ కొనుగోళ్ల వ్యవహారంలో నాయకులు, అధికారులు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. 3 రోజుల పాటు ఈ విచారణ సాగనున్నట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి సూర్యప్రకాష్, జిల్లా పౌర సరఫరాల డీఎం రాంపతి పాల్గొన్నారు.

వరి.. తడారి

వారబందీతో అన్నదాతలకు ఇబ్బందులు



అనంతగిరి మండలం పాలారం మేజర్‌కాలువ కింద ఎండిపోయిన త్రిపురవరం రైతుల పొలాలు

- ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూములకందని గోదావరి జలాలు
- వేలాది ఎకరాల్లో ఎండుతున్న పంటలు
- నిరంతరం సాగునీరు ఇచ్చి ఆదుకోవాలని వేడుకలు
- ఎన్ఎస్పీ పరిధిలోనూ తప్పని కష్టాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్పీ), ఏఎంఆర్పీ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) కాలువల కింద చివరి భూములకు నీరందడం లేదు. దీంతో పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరి భూములకు నీరందిస్తామని నాయకులు చెబుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎస్సారెస్పీ పరిధిలోని మోతె మండలానికి చెందిన రైతులు సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. పురుగుల మందు డబ్బాలతో వచ్చి బైఠాయించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద కూడా అదే పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలలో లైనింగ్ లేకపోవడంతో కంపచెట్లు పెరిగి కాలువలు దెబ్బతిన్నాయి. వచ్చే నీళ్లు కూడా రావడం లేదు. కొన్ని చోట్ల గండ్లు పడుతుండటంతో చివరి భూములకు నీరందడం లేదు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎంఆర్పీ) కింద డిస్ట్రిబ్యూటరీలు సక్రమంగా లేక నీరందటం లేదు. వీటికి తోడు వారబందీ విధానం రైతులకు శాపంగా మారుతోంది. ఈ విధానంలో ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

వారబందీతో అసలు సమస్య

ఎస్సారెస్పీ, ఏఎంఆర్పీ పరిధిలో వారబందీ అమలు చేస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల కాలువల లైనింగ్ దెబ్బతినడం, అనేక చోట్ల లైనింగ్ లేకపోవడంతో నీరు చివరి ఆయకట్టుకు చేరడం లేదు. వారబందీ కారణంగా ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. ఒక వారం ఒక నిర్దేశిత ప్రాంతానికి ఇస్తే మరో వారం ఇంకో ప్రాంతానికి ఇవ్వడంతో నిర్దేశిత ప్రాంతానికి మళ్లీ నీరు వచ్చే సరికి ఆలస్యం అవుతోంది. దీంతో మధ్యలోని పొలాలు కూడా ఎండిపోతున్నాయి. ఇక చివరి ఆయకట్టులో పొలాలైతే పూర్తిగా ఎండిపోయే పరిస్థితి వస్తోంది.

ఎస్సారెస్పీ పరిధిలో మరింత దారుణం

సూర్యాపేట జిల్లాలో ఎస్సారెస్పీ రెండో దశ కింద 2,13,175 ఎకరాల ఆయకట్టులో డిసెంబర్ 24 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు వారబందీ విధానంలో గోదావరి జలాలను విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ప్రస్తుతం ఆయకట్టు కింద దాదాపు రెండు లక్షలకు ఎకరాల వరకు వరి పంట సాగయింది. అయితే ఎండలు ముదరడం, వారబందీ విధానంలో చివరి భూములకు నీరందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి.

వేల ఎకరాలకు అందని సాగునీరు

ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద 3.81 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో 1.45 లక్షల ఎకరాలు నల్లగొండ జిల్లా పరిధిలో ఉండగా, మిగతాది సూర్యాపేట జిల్లా పరిధిలో ఉంది. సూర్యాపేట జిల్లాలోని ఎక్కువ శాతం వరి పొలాలకు సాగు నీరు అందటం లేదు. ఇక ఏఎంఆర్పీ కింద నల్లగొండ జిల్లాలో 2.50 లక్షల ఎకరాలకు నీరందాల్సి ఉండగా 2.29 లక్షలకు మాత్రమే అందుతోంది. వరద కాలవల కింద 50వేల ఎకరాలకు నీరు అందాల్సి ఉన్నా చివరి భూములకు నీరందడం లేదు.

మరమ్మతులకు నోచుకోని కాలువలతో..

జిల్లాలో 100 కిలోమీటర్ల మేర ప్రయాణించే ఎస్సారెస్పీ కాలువకు కేవలం ఏడు కిలోమీటర్ల మేరకు మాత్రమే లైనింగ్ ఉంది. మిగతా మొత్తానికి లైనింగ్ లేకపోవడం, కంపచెట్లతో మేజర్, మైనర్ కాలువలు నిండిపోవడంతో చివరి ఆయకట్టు భూములకు నీరు చేరడం గగనంగా మారింది. కాల్వలు తవ్విన నాటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏదో ఒకచోట గండ్లు పడి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. మేజర్ కాలువల నుంచి మైనర్ కాలువలకు తూముల వద్ద సరిగా షట్టర్లు లేకపోవడంతో నీటి పంపిణీ ఇబ్బందిగా మారింది. పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు నచ్చిన విధంగా తూములు ఏర్పాటు చేసుకోవడంతో ఉప కాలువల చివరి ఆయకట్టుకు నీరందడం లేదు.

లైనింగ్ పనులు చేపట్టాలి



ఎస్సారెస్పీ కాలువలు తవ్వారు కానీ లైనింగ్ మరిచారు. లైనింగ్ లేక మరమ్మతులు చేయక కాలువలు ధ్వంసం అవుతున్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించి కాలువలు తవ్వినప్పటికీ క్షేత్రస్థాయిలో సిబ్బందిని నియమించలేదు, లష్కర్లు, సూపర్‌వైజర్లు లేక కాలువలు పాడవుతున్నాయి. నీళ్లు కూడా సరిగా చెరువులు కుంటలకు పంటలకు చేరడం లేదు.

– వజ్జే శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు, జాజిరెడ్డిగూడెం మం. రామన్నగూడెం

నీరు అందక ఇబ్బంది పడుతున్నాం



పాలారం మేజర్ కింద ఉన్న త్రిపురవరం గ్రామ పరిధిలో పొలాలకు నీరు రావడం లేదు. దీంతో పొట్ట దశకు వచ్చిన పొలాలు ఎండి పోతున్నాయి. ఇప్పటికే వేల రూపాయల పెట్టుబడి పెట్టాం. అధికారులు ఈ కాలువలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసి చివరి భూములకు నీరు అందేలా చూడాలి.

– గుర్రం వెంకటరెడ్డి, త్రిపురవరం, అనంతగిరి మండలం





పొలాలకు సాగునీరు అందడంలేదని కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మోతె మండలం గోల్‌తండా రైతులు, రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

1న సూర్యాపేట మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్య ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యనే నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మున్సిపల్ కమిషనర్‌తో బుధవారం 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్



పి. రామానుజుల రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

ఫోన్ చేయాల్సిన నంబర్ : 98499 05912

అభివృద్ధికి టెక్నాలజీ జత కలిస్తే మరిన్ని అద్భుతాలు

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఈ ఆఫీస్ విధానం ప్రారంభం



ఈ- ఆఫీస్ సేవలు ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అభివృద్ధికి టెక్నాలజీ జత చేస్తే మరిన్ని అద్భుతాలు సాధించవచ్చని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈ- ఆఫీస్ విధానాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ-ఆఫీస్ విధానం ద్వారా సమయం ఆదాతో పాటు ప్రజలకు సత్వర న్యాయం లభిస్తుందన్నారు. ప్రజలకు మంచి పరిపాలన అందించడానికి ఈ- ఆఫీస్ విధానం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం రెవెన్యూశాఖలో ప్రారంభమైన సేవలు త్వరలోనే జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలకు విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ-ఆఫీస్ విధానంతో అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిశీలించిన మంత్రి

ఈ-ఆఫీస్ విధానం ప్రారంభించిన అనంతరం ప్రజావాణిలో అందిన కొన్ని ఫిర్యాదులపై మంత్రి మండల అధికారులతో మాట్లాడారు. సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. తన ఇంటి వెనకాల బాత్రూం కట్టకుండా అడ్డుకుంటున్నారని మఠంపల్లి మండలం యాతవాకిళ్లకు చెందిన బుడిగ మమత ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంది. ఆన్‌లైన్ ప్రజావాణి ద్వారా మంత్రి స్వయంగా ఎంపీడీఓ, తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మునగాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన వెంకటసుబ్బారావుకు చెందిన తొమ్మిది ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో బ్లాక్‌లిస్టులో ఉందని, ఎన్నో నెలలుగా మండల కార్యాలయంచుట్టూ తిరుగుతున్నానని విన్నవించగా మంత్రి వెంటనే మునగాల ఆర్డీఓ, తహసీల్దార్‌తో మాట్లాడారు. సుబ్బారావు సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, మోహన్ రావు, డీఆర్ఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్లు

నేడు కోదాడకు మాణిక్‌రావు ఠాక్రే రాక

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చిలుకూరు: కోదాడకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే మంగళవారం వస్తున్నట్లు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం చిలుకూరులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. హాథ్‌సే హాథ్ జోడోలో భాగంగా కోదాడలో నిర్వహించే గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకే గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ కొడారు బాబు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు , జిల్లా, మండల నాయకులు యడవెల్లా పుల్లారావు, కొండా ప్రభాకర్, కొల్లు నాగయ్య, రెమిడాల ఆనందరావు, లింగయ్య, కొడారు గురవయ్య, మండవ చిన్నా, విజయ్‌భాస్కర్, అంతయ్య, సొందుమియా, వీరబాబు, చిరంజీవి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోదాడలో ఇంటింటికీ కాంగ్రెస్

కోదాడ: రాహుల్ గాంధీ చేపట్టి పూర్తి చేసిన భారత్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా మంగళవారం సాయంత్రం 4గంటలకు కోదాడలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పద్మావతిరెడ్డి తదితరులు పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో వంగవేటి రామారావు, వరప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

• ప్రీతికి నివాళి



డాక్టర్ ధరావత్ ప్రీతి మృతికి సంతాప సూచకంగా సోమవారం సూర్యాపేట పట్టణంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న యూటీఎఫ్ నేతలు

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

సూర్యాపేటక్రైం : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం రహదారిపై గస్తీ నిర్వహించే పోలీస్ సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రహదారుల వెంట విజువల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస ఉన్నారు.

భార్యా భర్తలు గొడవలు పెట్టుకోవద్దు

భార్యాభర్తలు గొడవలు పెట్టుకోవద్దని దీని ప్రభావం పిల్లలపై పడతుందని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు.సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. కుటుంబ తగాదాల వల్ల పిల్లలు భవిష్యత్ కోల్పోతారన్నారు.

కుక్కలు, కోతులతో ఇబ్బందులు పడుతున్నాం

- కట్టడికి చర్యలు తీసుకోవాలి
- డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో కమిషనర్‌కు ప్రజల వినతి
- సమస్యను పరిష్కరిస్తాం: మున్సిపల్ కమిషనర్

కోదాడ: పట్టణంలో కోతులు, కుక్కలు, పందులతో ఇబ్బందులు పడుతున్నామని వీటి బెడదను నివారించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరారు. కుక్కలు, కోతుల బెడద, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సమస్యలపై సోమవారం సాక్షి ఆధ్వర్యంలో కోదాడ మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డితో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో పలువురు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. నమోదు చేసుకున్న అధికారులు వాటిని పరిష్కరించడానికి తక్షణం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ శేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్న: శ్రీమన్నారాయణకాలనీలో కోతుల బెడదతో ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడుతున్నాం. ఇక్కడ డ్రెయినేజీ కూడ సక్రమంగా శుభ్రం చేయడం లేదు.

– శ్రీనివాసమూర్తి, శ్రీమన్నారాయణ కాలనీ, కోదాడ.

కమిషనర్: కోతులు పట్టేవారు తక్కువ ఉండడం వల్ల ఆలస్యం అవుతోంది. సిద్దిపేట నుంచి రెండు మూడు రోజుల్లో తీసుకొస్తున్నాం. త్వరలోనే కోతులను పట్టిస్తాం. డ్రెయినేజీ సమస్యను తక్షణమే పరిష్కరిస్తాం.



సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ మహేశ్వరరెడ్డి

ప్రశ్న: పట్టణంలోని 21వ వార్డులో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. కాలువలు శుభ్రం చేయడం లేదు.

– దాసరి శ్రీనివాస్, 21వ వార్డు

కమిషనర్: పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కోదాడలోని గణేశ్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలు లేవు, వీధి దీపాలు లేవు. ఇబ్బంది పడుతున్నాం.

– ఎల్. ప్రసాదరావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్

కమిషనర్: విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి అక్కడ కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతాం. స్తంభాలు ఏర్పాటు చేయగానే వీధిలైట్లు అమర్చుతాం.

ప్రశ్న: నయానగర్‌లో కోతుల బెడద విపరీతంగా ఉంది. కుక్కలు కూడా ఇబ్బంది పెడుతున్నాయి. అధికారులు రోజూ వార్డుల్లో తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలి.

– కొల్లు వెంకటేశ్వరరావు, నయానగర్

కమిషనర్: కోతులను పట్టించే వారిని రప్పిస్తున్నాం. కొద్ది రోజుల్లోనే కోతులను పట్టిస్తాం. కుక్కలను పట్టిస్తున్నాం. నాలుగైదు రోజుల్లో కోదాడలో కుక్కల బెడద లేకుండా చేస్తాం. అధికారులు రోజు వార్డుల్లో పర్యటించాల్సిందిగా ఆదేశాలిచ్చాం. నేను కూడా పర్యటిస్తున్నాను.

ప్రశ్న: కోదాడ నుంచి తమ్మర వెళ్లే దారిలో రోడ్డు వెంట పంది మాంసాన్ని బహిరంగంగా పెట్టి అమ్ముతున్నారు. దీనివల్ల రోడ్డు వెంట వెళ్లేవారికి ఇబ్బందిగా ఉంది.

– బషీరుద్దీన్, లక్ష్మీపురం కాలనీ

కమిషనర్: తక్షణమే అక్కడ పంది మాంసం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. ఇంటో చెట్లను పాడు చేస్తున్నాయి.

– కుదరవెల్లి బసవయ్య, శ్రీరంగాపురం

కమిషనర్: కోతులను పట్టేవారు దొరకడం లేదు. సిద్దిపేటలో ఉన్న వారితో మాట్లాడాము. నాలుగైదు రోజుల్లో వస్తామన్నారు. కుక్కలను పట్టిస్తున్నాం.

ప్రశ్న: నయానగర్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పంపుల్లో సక్రమంగా రావడం లేదు.

– గడ్డం నర్సయ్య, నయానగర్

కమిషనర్: మిషన్ భగీరథ మెయిన్‌పైప్‌లైన్ రిపేరు వల్ల నాలుగు రోజులుగా సమస్య ఏర్పడింది. సోమవారం నుంచి నీరు అందిస్తున్నాం.

ప్రశ్న: ప్రధాన రహదారిపైన ఉన్న తార టీస్టాల్‌కు వచ్చే వారు రోడ్డుమీద పార్కింగ్ చేస్తున్నారు. వీధిలోకి వెళ్లడానికి, పోస్టాఫీస్‌కు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది.

– పొనగండ్ల అప్పిరెడ్డి, భవానీనగర్, పోస్టాఫీస్ బజార్

కమిషనర్: అక్కడ పార్కింగ్ చేయకుండా చూస్తాం. వినకపోతే మేమే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

ప్రశ్న: మావీధిలో మరుగుదొడ్డి వ్యర్థాలను మురుగు కాలువలోవదులుతున్నారు. ఇది ఇబ్బందిగా ఉంది.

– నారాయణరెడ్డి, ఓరుగంటి నారాయణ వీధి

కమిషనర్: మా సిబ్బందిని పంపి పరిశీలించి తక్షణమే సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: నయానగర్‌లో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. తక్షణమే కోతులను పట్టించాలి.

– లక్ష్మారెడ్డి, నయానగర్

కమిషనర్: కుక్కలను పడుతున్నాం. కోతులను కూడా త్వరలోనే పట్టించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: మా వీధిలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది.

–తాటి సత్యనారాయణ, ఆర్ఎస్‌వీ ఫంక్షన్‌హాల్ రోడ్డు

కమిషనర్: పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మా బజార్‌లో ఖాళీ ప్రదేశాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. కోతులు కూడా ఇబ్బంది పెడుతున్నాయి.

– వెంకటరమణారెడ్డి, పోస్టాఫీస్ బజార్, భవానీనగర్

కమిషనర్: కుక్కలను వెంటనే పట్టిస్తాం. కోతులను త్వరలో పట్టించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: లక్ష్మీపురం కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

– కె. రామారావు, లక్ష్మీపురం

కమిషనర్: కుక్కలను పట్టిస్తున్నాం. రెండు మూడు రోజుల్లో లక్ష్మీపురం కాలనీలో కుక్కలను పట్టిస్తాం.

ప్రశ్న : పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కలు, కోతులు తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయి. డ్రెయినేజీ సక్రమంగా తీయకపోవడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంది.

– పుట్టపాలక సురేష్, కోదాడ

కమిషనర్ : కుక్కలను పట్టిస్తున్నాం. కోతులను కూడా త్వరలో పట్టిస్తాం. డ్రెయినేజీలు ఎక్కడా తీయకపోయినా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : పట్టణంలో ట్రాక్టర్లు డోరు లేకుండా మట్టిని రవాణా చేస్తున్నాయి. దీని వల్ల మట్టి రాళ్లు రోడ్డుమీద పడి ఇబ్బందిగా మారింది.

– రాము, కోదాడ

కమిషనర్ : దీనిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

క్లుప్తంగా

రైలు నుంచి దిగబోయి వ్యక్తి మృతి


జగదీష్ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి దిగబోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన జగదీష్ రాజ్‌పురోహిత్(28) మిర్యాలగూడ పట్టణంలో ఫేలెవ్రుడ్ దుకాణం నిర్వహిస్తూ రవీంద్రనగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. అహ్మదాబాద్ నుంచి మిర్యాలగూడకు వచ్చేందుకు ఆదివారం బావానగర్–కాకినాడ రైలు ఎక్కాడు. రాత్రి 11:45 నిమిషాలకు మిర్యాలగూడ స్టేషన్‌లో ఆగిన రైలు తిరిగి కదిలింది. నిద్రలో ఉన్న జగదీశ్ రాజ్‌పురోహిత్‌కు మెలకువ రావడంతో వెళ్తున్న రైలు నుంచి రెండో ప్లాట్‌ఫాంపై దిగేందుకు దూకాడు. ప్రమాదవశాత్తు అతడు రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుని, తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

నేడు యాదగిరీశుడి కల్యాణం

- రాత్రి కల్యాణోత్సవంలో పాల్గొననున్న మంత్రులు,
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు


మాఢ వీధిలో స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరీశుని కల్యాణ మహోత్సవ నిర్వహణకు ఆలయ అధికారులు, ఆచార్యులు, ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశేష పర్వమైన కల్యాణోత్సవం మంగళవారం రాత్రి 8గంటల నుంచి ప్రారంభం కానుంది. యాదాద్రీశుడి ప్రధానాలయం ఉద్ఘాటన తర్వాత తొలి సారి జరుగుతున్న వేడుకను వైభవంగా నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చే వీఐపీలు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

కల్యాణోత్సవం ఇలా..

యాదాద్రీశుడి ప్రధానాలయంలో రాత్రి 7.30గంటలకు గజ వాహన సేవపై స్వామి వారు పెళ్లి కొడుకుగా ముస్తాబై మాఢ వీధుల్లో ఊరేగుతూ బ్రహ్మోత్సవ మండపానికి 8గంటలకు చేరుకుంటారు. ఆచార్యులు, వేదపండితులు పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణ వేడుకను ప్రారంభిస్తారు. తుల లగ్నంలో అమృత ఘడియల్లో రాత్రి 9.30గంటలకు స్వామి వారు అమ్మవారికి మాంగళ్యధారణ గావిస్తారు.

జగన్మోహినిగా నారసింహుడు

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి ఉత్సవాలు సోమవారం నాటికి ఏడవ రోజుకు చేరాయి. కల్యాణోత్సవానికి ముందస్తుగా పెళ్లి చూపుల పర్వం జరుపుకున్న స్వామివారు ఉదయం జగన్మోహిని రూపం దాల్చాడు. రాత్రి అశ్వవాహనంపై నారసింహుని ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు.

అశ్వవాహనంపై స్వామివారు.. ముత్యాల పల్లకిపై అమ్మవారు..

యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన ఎదుర్కోలు ఉత్సవం వేద మంత్రోచ్చారణలతో జరిగింది. శ్రీలక్ష్మీ దేవితో నారసింహుని కల్యాణోత్సవంలో భాగంగా పెళ్లి చూపుల తతంగాన్ని నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు అశ్వవాహనంపై స్వామిని, ముత్యాల పల్లకిపై అమ్మవారిని అలంకరించి ప్రధానాలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పు రాజగోపురం ముందు గల మాఢ వీధిలో పశ్చిమ ముఖంగా కూర్చోబెట్టి, అమ్మవారిని తూర్పు ముఖంగా అధిష్ఠించారు. దీంతో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చకులు, ఇతర అధికారులు స్వామి అమ్మవార్లకు ఇరు పక్షాలుగా వీడిపోయి పెద్దలుగా వ్యవహరించారు. ఇరువురి గుణగణములను ఆచార్యులు చర్చించుకున్నారు. శ్రీస్వామి వైపు ఉన్న వారికి, అమ్మవారి పక్షాన ఉన్న వారికి గుణగణములు, ఆదాయ, వ్యయాలు, తదితర అంశాలను వివరించారు. సుగుణములు కలిగిన అమ్మవారిని అమృతమైన గడియలో శ్రీస్వామి వారు పరిణయం ఆడాలని కోరారు. అనంతరం స్వామి అమ్మవార్ల తిరు కల్యాణ వేడుకకు సమయం నిర్ణయించారు. మంగళవారం రాత్రి 8గంటలకు అమ్మవారిని వివాహం చేసుకునేందుకు ముహూర్తం నిర్ణయించారు.


అశ్వవాహనం, ప్రత్యేక పల్లకిపై స్వామి అమ్మవారి ఊరేగింపు


పట్టువస్త్రాలు చూపెడుతున్న ఆచార్యులు


ఆస్థాన వైదిక ప్రార్థన చేస్తున్న ఆచార్యులు

మాఢ వీధుల్లో ఊరేగిన స్వామివారు

నిత్య పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీనరసింహుడు ఉదయం సుర, అసురులను సమ్మోహన పరిచే జగన్మోహినిగా అవతరించాడు. అలంకార సంబురాల్లో భాగంగా ఉదయం 9గంటలకు జగన్మోహిని రూపంలో స్వామివారిని అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి పాల్గొన్నారు.


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


రంగులు రుద్దుకుంటున్న విప్ సునిత, ఈఓ

ఆలయంలో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9గంటలకు శ్రీరామ అలంకారం, హనుమంత సేవ, రాత్రి 7గంటలకు నుంచి గజవాహన శేవ, ఆ కల్యాణ మహోత్సవం.

కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలన

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగే స్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవ ఏర్పాట్లను డీసీపీ రాజేష్‌చంద్ర సోమవారం పరిశీలించారు. కొండపై తూర్పు రాజగోపురం ముందు బ్రహ్మోత్సవ మండపం వద్ద జరిగే కల్యాణ వేడుకకు సంబంధించిన వేదిక, వీవీఐపీ, వీఐపీ, ఆచార్యులు, భక్తులకు సంబంధించిన గ్యాలరీ ఏర్పాట్లను చూశారు. భక్తులు ఎక్కడ నుంచి వస్తారు, వీవీఐపీలు, వీఐపీలు, ఎక్కడ కూర్చుంటారు, శ్రీస్వామి వారి సేవ ఆలయం నుంచి ఎలా అవస్తుందనే అంశాలను ఆలయాధికారులతో చర్చించారు. ఇక కొండపైకి వాహనాలు వచ్చిన సమయంలో ఎక్కడెక్కడ పార్కింగ్ చేయాలనే వాటిపై స్థానిక పోలీసులకు సూచించారు. డీసీపీ వెంట ఏసీపీలు నర్సింహారెడ్డి, సైదులు, సీఐలు సైదయ్య, నవీన్‌రెడ్డి, ఆలయాధికారులు దోర్బల భాస్కర్‌శర్మ, రాజన్‌బాబు తదితరులున్నారు.


పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

పట్టువస్త్రాలు అందజేత

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో నిర్వహించే స్వామి అమ్మవార్ల తిరు కల్యాణ వేడుకకు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన కుటుంబం తరఫున పంపించిన పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వడ్లోజు వెంకటేష్ సోమవారం ఆలయ ఈఓ గీతారెడ్డికి అందజేశారు. స్వామివారి జగన్మోహిని అలంకార సేవ ఊరేగింపు పూర్తి అయిన తరువాత ప్రథమ ప్రాకార మండపంలో అందించారు.


ఈఓకు పట్టువస్త్రాలు అందజేస్తున్న వడ్లోజు వెంకటేష్

ముస్తాబవుతున్న ఆలయం..

స్వామి అమ్మవార్ల కల్యాణం జరిగే బ్రహ్మోత్సవ మండపాన్ని పూల అలంకరణతో సిబ్బంది తీర్చిదిద్దుతున్నారు. ఇక తూర్పు మాఢ వీధిలో భక్తులు, వీఐపీలు కూర్చొని కల్యాణాన్ని తిలకించే విధంగా ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. క్యూకాంప్లెక్స్, ఉత్తర రాజగోపురం ముందు ఖాళీ స్థలాల్లో ఎల్ఈడీ స్క్రీన్స్‌లో కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకకు రాష్ట్ర మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితాఇంద్రారెడ్డి, సీఎస్ శాంతికుమారితో పాటు 10 మంది ఐఏఎస్ అధికారులు హాజరుకానున్నట్లు ఈఓ గీతారెడ్డి తెలిపారు.


బ్రహ్మోత్సవ మండపం ముందు కల్యాణ వేదికను సిద్ధం చేస్తున్న సిబ్బంది

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ నిగిడాల సురేష్ వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణం సీతారాంపురం గీతమందిర్‌కు చెందిన చిన్నపల్లి రవి, హనుమాన్‌పేటకు చెందిన రమావత్ రాజేష్, అనుముల మండలం హాజారిగూడం గ్రామానికి చెందిన కొత్తపల్లి అంజి ముగ్గురు స్నేహితులు. వీరు చెడు వ్యసనాలకు అలవాటు పడి అవసరాలను తీర్చుకునేందుకు కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. వీరు గత సంవత్సరం డిసెంబర్, ఫిబ్రవరి నెలలో పట్టణంలోని ప్రకాశ్‌నగర్, శాంతినగర్, హాజారిగూడం గ్రామాల్లోని పలు ఇళ్లలో చోరీలు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పట్టణంలోని కేసీఆర్ చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తుండగా బైక్ వెళ్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాలను అంగీకరించారు. వారి వద్ద నుంచి 5.3 గ్రాముల బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.46 వేలు, బైక్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.కృష్ణయ్య, హెడ్‌కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు ఉన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి

గరిడేపల్లి : వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.రామారావునాయక్ కోరారు. 13వ విడత ప్రధాన మంత్రి సమ్మాన్ నిధి యోజన పథకం నగదు బదిలీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కేవీకేలో పీఎం నరేంద్రమోదీ ప్రత్యక్ష విక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు లవకుమార్, నరేష్, కిరణ్, తదితరులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ముగియనున్న కృష్ణారెడ్డి పదవీకాలం
- జిల్లాకు మరోసారి అవకాశం దక్కేనా..

సాక్షి, యాదాద్రి: భువనగిరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం మార్చితో ముగియనుంది. ఎన్నికల సంఘం ఎమ్మెల్యే కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన కృష్ణారెడ్డి పదవీకాలం మార్చిలో ముగియనుండడంతో మరోసారి జిల్లాకు ఎమ్మెల్సీ పదవి వస్తుందా అన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఇప్పటికే భువనగిరి జిల్లాకు పలువురు బీఆర్ఎస్ నాయకులు తమకు అవకాశం ఇవ్వాలని అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్ద ప్రయత్నాలు ప్రారంభించారు. మరోసారి అవకాశం కోసం ఎలిమినేటి కృష్ణారెడ్డి కుటుంబం ఎదురు చూస్తోంది. మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, సీనియర్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, నేతి విద్యాసాగర్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ మరికొందరు నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, ఈ పదవికి రాష్ట్రం యూనిట్‌గా అభ్యర్థిని ఎంపికచేసే అవకాశం ఉన్నందున అధినేత కేసీఆర్ చూపు ఎవరిమీద ఉంటుందోనన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికకు అభ్యర్థుల ఎంపిక సామాజికవర్గ సమీకరణల మీద ఆధారపడి ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కేసీఆర్

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలను మోసం చేస్తున్నాడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు విమర్శించారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రాజకీయంగా కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగాలకు ఉద్యోగాలు రాలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూమ్‌ల పేరుతో నిరుపేదలను, లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేశారన్నారు. ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించి వ్యవసాయాన్ని నష్టాల్లోకి నెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పంది రాంరెడ్డి, కాప రవి, ఎం.డి. ఆబిద్, చందా కృష్ణ మూర్తి, సంద్యాల సైదులు, ఎండి అస్లాం, పాటి కరుణాకర్‌రెడ్డి, పందిరి మాధవరెడ్డి, తూడి సారయ్య, వల్దాస్ ఉపేందర్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, బైరెడ్డి వెంకటరెడ్డి, మేడి కృష్ణ, జనార్దన్ పాల్గొన్నారు.

మహిళను కాపాడిన వైద్య విద్యార్థులు

సూర్యాపేట క్రైం : చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను వైద్య విద్యార్థులు కాపాడారు. ఈ ఘటన సూర్యాపేట పట్టణంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రం మినీ ట్యాంక్ బండ్‌పై ఆదివారం రాత్రి చందన కళాశాలలో ఫిజియోథెరఫీ మూడో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు తరుణ్, వేదవ్యాస్, యోగేష్, నాగ దత్త వాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో వారికి దగ్గర నుంచి సూర్యాపేటకు చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చి చెరువులో దూకింది. వెంటనే చూసిన విద్యార్థులు ఏం ఆలోచన చేయకుండా చెరువులోకి దూకి ఆమెను కాపాడారు. పలువురు విద్యార్థులను అభినందించారు.

బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు అయినా మద్దతు ఇస్తాం

హుజూర్‌నగర్: బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు అయినా మద్దతు ఇస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి వెల్లడించారు. సోమవారం హుజూర్‌నగర్ వచ్చిన ఆయన స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి రాకుండా చూడటమే సీపీఎం, వామపక్షాల ఏకైక లక్ష్యం అని ఆయన అన్నారు. దానికి అనుగుణంగానే ఎన్నికల ఎత్తుగడలు ఉంటాయని చెప్పారు. బీజేపీని ఒంటరిగా ఓడించే శక్తి ఉన్నదగ్గర ఒంటరిగానే ఎదిరిస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో కలిసి ముందుకు వెళతామని ఆయన తెలిపారు. బీజేపీ జెండా పట్టుకుని, వాళ్లకు జై కొట్టిన వారు ఎన్ని నేరాలు చేసినా, అక్రమాలకు పాల్పడినా వాళ్లపై ఎలాంటి కేసులు ఉండవని, సీబీఐ, ఈడీ వాళ్ల జోలికి వెళ్లవని ఆయన తెలిపారు.అదాని వందల కోట్లు ప్రజా ధనాన్ని కొల్ల గొడుతున్నాడని ఆరోపణలు వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వానికి దమ్ముంటే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, హుస్సేన్, యోనా, ఆర్ .మురళి, సీహెచ్ వీరమల్లు ,పాశం వెంకట్ నారాయణ, పి .వెంకట్ రెడ్డి, ఎస్. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి